నన్నాడు.... బాగా చూసుకుంటానని కూడా అమ్మకి మాటిచ్చినా. ఈనాడు వాదినా. అన్నయ్య ఇద్దరూకలసి అనవసరంగా ఏ కారణం లేకుండానే ఏదో చిన్నసాకుతో కొడుతున్నారు.

ఓసారి.... "నీవెప్పుడు ఛ సవే.... దరిద్రపుముండా.... ఫో.... పోయి ఎక్కడన్నా అడుక్కుతిను.. లేదా ఎందులో నన్నాపడి చావు." అంటూ యేకారణం లేకుండానే తిట్టినపుడు తానెంత ఏడ్చిందని. 'అనవసరంగా యెందుకేడుస్తున్నావ్' అంటూ వెంటనే వాదినొచ్చి కొడితే నాలుగు రోజులవరకూ వీపుమీద వాతలలాగే వుంటే. రాణీ వచ్చి వేడినీళ్ళతో కాపుతూ వుండిపోయింది.

నిజంగా తాను చచ్చిపోవాలి.... ఎందుకీ జీవితం. తల్లిదండ్రులు లేకుండా అన్నయ్య. వదిన వుండి లేనిసమానంగా వున్న ఈ రోగిష్టి దాన్నెవడు పెళ్ళి చేసుకుంటాడు. చూసుకుంటాడు.

అసలు నేనెందుకున్నాను. భూదేవికి మరో మనిషి బరువు. తల్లి తన బిడ్డ అన్యాయమైపోతోంటే చూడదుగదా.... మరి....ఈ భూదేవి తల్లి గదా. ఎంతమంది నాలాంటి వాళ్ళకన్యాయమైపోతోంటే మరి ఈ భూదేవెలా చూస్తూ వూర్కొంటుంది. యేదేమైనా నా జీవితం పాడు. ఛస్తాను.... ఈ రోజెలాగైనా ఛస్తాను. యింక ఈ జీవితానికి వుపయోగం లేదు. ఈ దెబ్బలు.... ఈ మాటలు.... ఈ చూపులు భరించలేను.

పాం....పాం.... అంటూ మిల్క్‌వాన్ వచ్చిన చప్పుడుకి చటుక్కున ఆలోచనల నుండి తేరుకుని. వెంటనే వురుకుల్తో. వరుగుల్తో బిందె తీసుకుని నీళ్లు తీసుకురావడానికి బయల్దేరింది తెల్లవార్లూ చుక్కల్నిచూస్తూ ఆలోచించిన కాంతి. ❀

---

# దాగిన సత్యం

మొగలి పద్మాదేవి




బెజవాడ రైల్వే స్టేషను 'కోణార్క్'లో దిగిన జనంతో రద్దీగా వుంది. స్టేషన్ ముందు బేరాలకోసం పడిగాపులు పడి కూర్చున్నా రిక్షావాళ్ళలో చైతన్యం కలిగింది.

బేరాలు పోతాయేమో అన్న భయంతో గిట్టుబాటు కాకపోయినా పోటీల మీద కట్టేస్తున్నారు రిక్షాల్ని. ఏసయ్య కూడా అదే ఆరాటంలో వున్నాడు. ఇంతలో ఒక ఆసామీ సూట్‌కేసు. మనీ బేగ్ పట్టుకుని భారీ కాయాన్ని భారంగా మోసుకుంటూ వచ్చి ఏసయ్య రిక్షాలో ఎక్కేశాడు బేరం ఆడకుండానే. ఏసయ్య దేవుణ్ణి తలచుకొని ఆసామీ చెప్పిన సత్యనారాయణపురంవైపు దారితీశాడు. అడ్రసు సరిగ్గా తెలియని ఆసామీ రిక్షాని కాసేపు అటూ. ఇటూ తిప్పించి చివరకి ఒకచోట దిగిపోయాడు. మంచినీళ్ళు త్రాగడంకోసం రిక్షాని రోడ్డుప్రక్కగా ఉంచబోతున్న ఏసయ్యకళ్లు జిగేల్ మన్నాయి. సీటుమీద నిగనిగలాడుతూ నల్లటి మనీబేగ్. ఏసయ్య నెమ్మదిగా తీశాడు. పాపం ఆసామి అడ్రసు తెలియని హడావిడిలో సంచివదిలేశాడు అనుకుంటూ జిప్‌లాగాడు. నిండా నోట్లకట్టలు. వదివేల రూపాయలకు తక్కువ ఉండవు.సంతోషం భయం రెండూ కలగలిసిపోయాయి. గుండెల్లో ఏదో గాబరా. చుట్టూ చూశాడు. ఎవరూ తనని గమనించడంలేదు. - ఈ డబ్బు తీసేసుకుంటే తను సొంతంగా రిక్షాను కొనుక్కోవచ్చు. తన కుటుంబం కష్టాల్నించి గట్టెక్కుతుంది. ఆసామీ తన రిక్షాలోనే డబ్బుసంచి వదిలేశాడన్న ఋజువేమిటి? - ఆలోచిస్తున్న ఏసయ్యకు ఒక్కసారి ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది. చమటోడ్చి. కష్టపడైనా ఇప్పటి వరకు నీతిగా. నిజాయితీగా వున్న తన బ్రతుకు తననే వెక్కిరించినటయింది. ఛీ ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను అనుకున్నాడు వెంటనే.

"ఆ మనిషి ఎవరైతే ఏం అతను సంచిని నా రిక్షాలో మర్చిపోయాడు. అది అతనికి అందజేయడం నా ధర్మం. అంతే కాని దాన్ని తీసుకుని కిమ్మనకుండా ఊరుకోవడం అన్యాయం కాదూ. ఎవరూ చూడక పోతే ఏం? దేవుడు చూడూ! ఎంత ఎదవ ఆలోచన వచ్చింది ఈవాళ" అనుకున్నాడు. అనుకున్నదే తడవు పోలీస్‌స్టేషను కెళ్ళాడు. అదే సమయానికి ఆసామీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతూ కనబడ్డాడు ఏసయ్యకు. తిన్నగా వాళ్ళదగ్గరకెళ్ళి సంగతిచెప్పి డబ్బుసంచి ఇచ్చేశాడు. పెట్టింది పెట్టినట్టున్న ఆ డబ్బును చూసుకోగానే ఆసామీ ముఖం చాటంతయింది. ఇన్‌స్పెక్టరు ఏసయ్య మంచితనాన్ని. నీతి నిజాయితీలను ఎంతో మెచ్చుకుని సంతోష పూర్వకంగా ఆసామిచేత ఏసయ్యకు ఏభై రూపాయలు ఇప్పించాడు. అయితే అక్కడే వచ్చింది చిక్కు. ఆ ఏభై రూపాయలు ఏసయ్యలో అలజడి రేపాయి. అద్దె రిక్షా ఎక్కినప్పుడల్లా ఏసయ్యకు ఆ పదివేలూ గుర్తొస్తాయి. 'న్యాయంగా నీతిగా నిలబడినందుకు తనకు ఏభై రూపాయలు దక్కాయి. కాని న్యాయం మర్చిపోయి. అవినీతిని నిద్రలేపి. అధర్మానికి చోటిచ్చి తను గనుక గుట్టుచప్పుడు కాకుండా ఆ సంచిని దాచేస్తే అప్పుడు పదివేలూ దక్కేవి. న్యాయం విలువ ఏభై రూపాయలు. అన్యాయం విలువ పది వేలూనా. ఎంత విచిత్రం.' ఇలా ఆలోచనల్తో ఎన్నిసారు తలబ్రద్దలు కొట్టుకున్నా దాగిన సత్యంలో మహాత్యం అర్థంకాక అసలు న్యాయానికే అన్యాయం జరిగిపోయిందని బాధపడిపోతుంటాడు ఏసయ్య. ●

